
సాక్షి ఖమ్మం

బుధవారం ׀ 24 ׀ మే ׀ 2023



పాఠశాలలకు హంగులు

జిల్లాలోని 22 ప్రభుత్వ పాఠశాలలకు 'పీఎంశ్రీ' పథకం కింద ఎంపిక కావడంతో అన్ని వసతులు సమకూరనున్నాయి. 8లో



ఇంకా మీనమేషాలే..

సత్తుపల్లి ఓసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు వసూలు వారిపై చర్యలు తీసుకోవడంతో అధికారులు జాప్యం చేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 27°

వాతావరణం

జిల్లాలో బుధవారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

పాత ఎన్టీఆర్ కాల్వ భూమి అటవీ శాఖదే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ మంజుల

సత్తుపల్లి: సత్తుపల్లిలోని పాత ఎన్టీఆర్ కాల్వ భూములు అటవీశాఖకు చెందినవేనని సత్తుపల్లి ఫారెస్ట్ డివిజనల్ అధికారి వి.మంజుల స్పష్టం చేశారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో సింగరేణి పీఓ వెంకటాచారి, రేంజర్ వెంకటేశ్వర్లతో ఎఫ్‌డీఓ మంగళవారం సమావేశమయ్యారు. సింగరేణి సంస్థ ఈ కాల్వను మట్టితో పూడ్చే పనులు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాల్వ నిర్మాణం కోసం ఇరిగేషన్ శాఖకు 1988 అక్టోబర్ 12వ తేదీన 30ఎకరాల అటవీ శాఖ స్థలాన్ని బదలాయించగా, ఏటా స్థలం వివరాలపై ఇరిగేషన్‌శాఖ పీసీసీఎఫ్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కాల్వను పూడ్చడానికి, కట్టడాలకు కానీ అనుమతి ఉండదన్నారు. కాగా, టింబర్ డిపో స్థలం రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా నిర్ధారణ కావడంతో జీఓలు కూడా వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్ఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'దిశ' కమిటీ సమావేశం

ఖమ్మం సహకారనగర్: కేంద్రప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలపై సమీక్షించేందుకు 'దిశ' కమిటీ సమావేశాన్ని ఈనెల 25న గురువారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, దిశ కమిటీ కార్యదర్శి వీ.పీ.గౌతమ్ తెలిపారు. కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

కలెక్టర్‌ని కలిసిన ట్రైయినీ ఐఏఎస్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మయాంక్ సింగ్

ఖమ్మం సహకారనగర్: జిల్లా శిక్షణ కలెక్టర్‌గా మయాంక్ సింగ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన స్వస్థలం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్. యూపీఎస్సీలో 380వ ర్యాంక్ సాధించిన ఆయనను శిక్షణలో భాగంగా ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించిన మయాంక్.. కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరగాలి



ముష్టికుంట్లలో సోక్‌పిట్‌కు శంకుస్థాపన చేస్తున్న డీఆర్డీఓ

చింతకాని/బోనకల్: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా ఈజీఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని డీఆర్డీఓ విద్యాచందన ఆదేశించారు. చింతకాని మండలం జగన్నాథపురం, బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ పనుల్లో ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా చూడడంతో పాటు కనీసం రూ.250 వేతనం పొందేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టెంట్, మెడికల్ కిట్లు, తాగునీటి వసతులు కల్పించాలని, ఉదయం 6నుంచి 10 గంటల వరకు మాత్రమే కూలీలతో పనులు చేయించాలని సూచించారు. అలాగే, ముష్టికుంట్లలో ఉపాధి హామీ నర్సరీని పరిశీలించి సోక్ పిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు శ్రీనివాసరావు, వేణుమాధవ్, ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, ఎంపీఓ శాస్త్రి, సర్పంచ్ ఆలస్యం నాగయ్య, ఏపీఓలు కోటయ్య, కృష్ణకుమారితో పాటు వెంకటరమణ, వినోద్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిని జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ ఎల్.గోపి, జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే వారికి అందుతున్న వైద్య సేవలతో పాటు డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. సత్తుపల్లిలోని డాక్టర్ రఘురాం ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ సేవలు మంజూరయ్యాయని తెలిపారు. ఈకార్యక్రమంలో టీం లీడర్ కె.జగదీష్, ఆరోగ్య మిత్రలు వేము మోహన్‌రావు, డి.అనుపమ పాల్గొన్నారు.

ముందుకు సాగుదాం..



ముఖాముఖిలో మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ రాఘవరెడ్డి (ఫైల్)

పంట కాలాన్ని మార్చడంపై శాస్త్రవేత్తల దృష్టి

- జిల్లాలో రైతులకు అవగాహన సదస్సులు
- పంట దిగుబడి, నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని సూచనలు
- ప్రధానంగా వరి పంటపై నజర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతాంగం పంటలు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు సాగుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కాలాన్ని ముందుకు జరపడం ద్వారా ఫలితాలు బాగుంటాయని చెబుతున్న జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రధానంగా వరి పంటను ఈ పద్ధతిలో సాగు చేసేలా రైతులను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వైరా కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు జిల్లాలో కొద్దిరోజులుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పంటలు దెబ్బతినడంతో..

యాసంగిలో అకాలవర్షాలు, ఈదురుగాలులు, వడగళ్ల వానలతో పంటలు దెబ్బతిన్నాయి. మార్చి నుంచి మొదలు మే వరకు కురుస్తున్న అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంటలకు నష్టం వాటిల్లగా దిగుబడి పడిపోవడమే కాక నాణ్యత తగ్గింది. ఈ నేపథ్యాన ఇలాంటి పరిస్థితులు ఎదురుకావొద్దని శాస్త్రవేత్తలు పంట కాలాన్ని ముందుకు జరపాలని నిర్ణయించారు. తద్వారా అకాల వర్షాల బెడద ఉండదని భావిస్తున్నారు. జిల్లా రైతాంగం ప్రధానంగా వరి, మిర్చి, పత్తి పంటలను సాగు చేస్తారు. ఇందులో వరి పంట కాలాన్ని ముందుకు తీసుకొచ్చేలా శాస్త్రవేత్తలు కసరత్తు చేపట్టారు. తొలకరి పడగానే పత్తి సాగు చేయనుండగా, మిర్చికి సంబంధించి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నాటేవారు.



రంగంలోకి శాస్త్రవేత్తలు

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ముందస్తు పంటల సాగు కసరత్తు చేపట్టి ప్రభుత్వ అనుమతితో వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం, కేవీకేల శాస్త్రవేత్తలతో వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ విభాగాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, నిపుణులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన సదస్సుల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీకి చెందిన ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.రాఘవరెడ్డి, వరంగల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ అడిషనల్ డైరెక్టర్ ఉమారెడ్డి ఆధ్వర్యాన వైరా కేవీకే శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో ముఖాముఖి పూర్తయింది. ఇదే సమయాన పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని భూసారాన్ని పెంచుకునే అవకాశంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల చివరి వారంలో విత్తనమేళా నిర్వహించే దిశగా కార్యాచరణ రూపొందించారు.

అయితే ఆగస్టు 15లోగా నాటడమే ముందస్తు సాగు విధానం. ఈ విధానంలో మిర్చి పూత, దిగుబడి పెరుగుతుందని, తెగుళ్ల బెడద తగ్గి పంట నాణ్యతగా ఉంటుందనేది అంచనా.

వరి సాగుకు అనుకూలం

వరి పంట కాలాన్ని ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. వరిలో దీర్ఘకాలిక, మధ్యస్థ, స్వల్ప కాలిక రకాలు ఉంటాయి. సాధారణంగా జూలైలో వరి నారుమళ్లు పోసి ఆగస్టు 31 వరకు నాట్లు పూర్తి చేస్తారు. అయితే ముందస్తు విధానంలో దీర్ఘకాలిక రకాలను మే 25 నుంచి జూన్ 5 లోపు, మధ్య కాలిక రకాలను జూన్ 15 లోపు, స్వల్ప కాలిక రకాలను జూన్ 25 లోపు నారుమళ్లు పోసుకోవాలి. తద్వారా అక్టోబర్ మూడో వారం నుంచి నవంబర్ మొదటి వారంలోపు కోతలు పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా మళ్లీ యాసంగిలో వరి, ఆరుతడి పంటలను సకాలంలో సాగు చేసుకోవడానికి వీలవుతుంది. ఇక యాసంగిలో వరి సాగుకు స్వల్ప కాలిక రకాలను ఎంచుకుని నవంబర్ 15 నుంచి 20 లోపు విత్తుకుంటే మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్ మొదట్లో పంట కోతకు వస్తుంది.

ముందస్తు సాగు మంచి నిర్ణయం..



ముందస్తు పంట కాలం అనేది మంచి నిర్ణయం. అయితే అందుకు అనుకూలమైన వాతావరణం ఉండాలి. ముందస్తు పంట కాలానికి అనుగుణంగా జలాశయాలను, చివరి ఆయకట్టులో ఉన్న పంట కాల్వలను అభివృద్ధి చేయాలి. అప్పుడే నీటి వసతి మెరుగై దిగుబడులు మంచిగా వస్తాయి.

– తుమ్మల రాణాప్రతాప్, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆర్ఈసీ సభ్యుడు, వల్లాపురం

అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి



ముందస్తు పంట కాలంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. రైతులు ఈ విధానాన్ని అవలంబించాలి. ప్రధానంగా వరిని ముందుగా సాగు చేస్తే తెగుళ్ల, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. అకాల వర్షాలతో పంటకు నష్టం వాటిల్లక రైతులకు ప్రయోజనంగా ఉంటుంది.

– డాక్టర్ జె.హేమంత్‌కుమార్, కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

ప్రభుత్వ ఆదేశాలతో అవగాహన



ముందస్తు పంట కాలంపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఈవిషయంలో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తాం. ఈ విధానం ద్వారా మంచి ఫలితాలుంటాయి. అకాల వర్షాలు, వడగళ్ల వానల నుంచి పంటను రక్షించుకునే అవకాశముంది.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

'మన ఊరు–మన బడి'పై ప్రత్యేక దృష్టి

- పనుల్లో మరింత వేగం పెంచాలి
- సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మన బడి ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచి విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి వరకు 104 పాఠశాలల్లో పనులు పూర్తి చేయగా, మిగతా చోట్ల కూడా వేగం పెంచాలన్నారు. అలాగే, పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ సమకూర్చాలని కలెక్టర్ ఈసందర్భంగా సూచించారు.

లక్ష్యం మేరకు 'హరితహారం'

హరితహారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన ఎంపీడీఓలతో హరితహారం, స్వచ్ఛ సర్వేక్షణ్, ఉపాధి, క్రీడా ప్రాంగణాలపై సమీక్షించారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్ తదితర చోట్ల 19,87,750 మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అలాగే, ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన, స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సాధనపై దృష్టి సారించాలని తెలిపారు.

సబ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేయండి

సబ్ సెంటర్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా సమీక్షించిన ఆయన ఆరోగ్య భవనాలు, వైద్యసేవలు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం, కంటివెలుగు అమలుపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో పనుల పురోగతిని వివరించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీఎంహెచ్ఓ మాలతి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఎల్పీఓలు పుల్లారావు, ప్రభాకర్, పీఆర్ ఎస్ఈ సుదర్శన్, ఈఈలు కే.వీ.కే.శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై కలెక్టర్ సీరియస్

నేలకొండపల్లి వెంచర్లపై క్షేత్రస్థాయిలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..



వెంచర్‌లో పరిశీలిస్తున్న డీటీసీపీ అధికారి సృజన

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అనుమతి లేకుండా ఏర్పాటుచేస్తున్న వెంచర్లపై కలెక్టర్ గౌతమ్ సీరియస్ అయ్యారు. ఈ విషయమై 'సాక్షి'లో ఆదివారం 'పుట్టగొడుగుల్లా... అక్రమ వెంచర్లు' శీర్షికన ప్రచురితమైన కథనంతో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈమేరకు మంగళవారం డీటీసీపీ అధికారి సృజన మండలంలోని వెంచర్లను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. అనుమతి లేని వెంచర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయించారు. ఈవిషయమై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. మండల పంచాయతీ అధికారి సీ.హెచ్.శివ, సర్పంచ్ రాయపూడి నవీన్, కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే సండ్ర



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి అజయ్, ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి: హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినందుకు గాను సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇక సత్తుపల్లి నియోజకవర్గంలోనూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సండ్ర కోరగా, స్పందించిన సీఎం అవసరమైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని సీఎస్ శాంతకుమారికి సూచించారు. అలాగే, వీఆర్ఏలు, జేపీఎస్‌ల సర్వీస్ క్రమబద్ధీకరణపై సీఎంకు మంత్రి, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలో ఆస్పత్రుల భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృతజ్ఞతలు తెలిపి పలు ప్రతిపాదనలు సమర్పించారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరవుతారని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని మంత్రులు, ప్రభుత్వ విప్‌లు ఆవిష్కరిస్తారని వెల్లడించింది. ఈమేరకు జిల్లా కేంద్రంలో మంత్రి పువ్వాడ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనుండగా, కలెక్టర్, సీపీ, జెడ్పీ చైర్మన్, మేయర్, ఇతర ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొనాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. అలాగే, మండల కేంద్రాలు, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మన చరిత్ర చెప్పి.. విజయం సాధించి..

సివిల్స్‌లో మెరిసిన కొత్తగూడెం వాసి సాయికృష్ణ

- జాతీయ స్థాయిలో 293వ ర్యాంకు
- నాలుగో ప్రయత్నంలో సక్సెస్
- ఇంటర్వ్యూలో భద్రాద్రి చరిత్రపై ప్రశ్నలు



సాయికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగలక్ష్మి తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆలిండియా సివిల్స్ పరీక్షలు – 2022లో కొత్తగూడెం పట్టణానికి చెందిన గ్రంథె సాయికృష్ణ జాతీయ స్థాయిలో 293వ ర్యాంకు సాధించారు. సాయికృష్ణ తండ్రి శ్రీనివాసరావు పట్టణంలోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తుండగా తల్లి తల్లి నాగలక్ష్మి గృహిణిగా ఉన్నారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించిన విషయం తెలియగానే శ్రీనగర్ కాలనీలోని సాయికృష్ణ నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి నుంచి సివిల్స్ వరకు సాగిన తన ప్రయాణాన్ని సాయికృష్ణ 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎస్సెస్సీ వరకు కొత్తగూడెంలోనే..

ఇంటికి దగ్గర్లోనే సూర్యోదయ స్కూల్‌లో మూడు నుంచి పదో తరగతి వరకు చదువుకున్నా. పదో తరగతిలో మంచి మార్కులు రావడంతో విజయవాడకు చెందిన ప్రముఖ కాలేజీలో ఇంటర్‌లో ఉచితంగా సీటు వచ్చింది. ఇంటర్‌లో మార్కులే లక్ష్యంగా కాకుండా సబ్జెక్ట్‌లపై లోతైన అవగాహన పెంచుకునేందుకు ప్రయత్నించాను. దీంతో జేఈఈలో మంచి ర్యాంక్ వచ్చింది. కేరళలోని కాలికట్‌లో బీటెక్(మెకానికల్) 2017లో పూర్తయింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఎల్అండ్‌టీలో మెకానికల్ ఇంజనీర్‌గా మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది.

ఇక్కడి సమస్యలే స్ఫూర్తి..

కొత్తగూడెం జిల్లా ఏర్పడ్డాక కొన్నేళ్లుగా పరిస్థితులు మారాయి. కానీ నా చిన్నతనంలో సింగరేణి, కేటీపీఎస్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నా విద్య, వైద్య పరంగా చాలా వెనుకబాటుతనం ఉండేది. కొత్తగూడెంలో ఎంఆర్ఐ స్కాన్ కూడా అందుబాటులో లేదు. ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. అక్కడ కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఆర్ఐ లేదు. ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు. దీంతో సహజంగానే చాలా ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ఈ పరిస్థితిలో మార్పు వస్తే బాగుండు అనిపించేది. ఒక్క వైద్య రంగమనే కాదు.. చాలా విషయాల్లో ఇదే పరిస్థితి ఉండేది. పెద్దయ్యాక ఈ పరిస్థితిలో మార్పు తెస్తే బాగుంటుందని అనిపించింది.

మన చరిత్రే మూలం..

సివిల్స్ ఇంటర్వ్యూ సందర్భంగా చరిత్రలో మీ జిల్లా ప్రాధాన్యత ఏమిటనే ప్రశ్న ఎదురైంది. శాతవాహనుల కాలం కంటే ముందు కారుకొండ రామారం గుట్టల్లో ఉన్న బుద్ధుడు మొదలు ఒంటిగుట్టలో కేవ్ పెయింటింగ్స్, ఇక్కడ ఇప్పటికీ మిగిలి ఉన్న జైన సంస్కృతి, కంచర్ల గోపన్న కట్టించిన భద్రాచల రామాలయం ఆ తర్వాత పరిస్థితులు పూర్తిగా వివరించాను. అంతేకాకుండా పర్ణశాల విశిష్టతను కూడా చక్కగా వివరించడం ఇంటర్వ్యూ చేసిన వారిని ఆకట్టుకుంది.

ఎప్పటికీ ప్రత్యేక స్థానమే..

ఇక్కడి సమస్యలే నన్ను కదిలించాయి. ఈ సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పని చేయాలనే స్ఫూర్తిని రగిలించాయి. ఆ ప్రయాణం చివరి మెట్టులో సివిల్స్ ఇంటర్వ్యూలో నాపై మంచి అభిప్రాయం కలిగించింది కూడా ఈ నేల చరిత్రనే. రేపు ఏ ఉద్యోగం వచ్చినా, ఎక్కడ విధుల్లో ఉన్నా ఈ నేలకు, ఇక్కడి ప్రజలకు ఎప్పటికీ ప్రత్యేక స్థానమే ఉంటుంది.

సవాల్‌గా తీసుకుని..

ఎల్ అండ్ టీలో ఉద్యోగం చేస్తున్నా పూర్తి స్థాయిలో సంతృప్తి లేకపోవడంతో సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. 2019లో తొలి ప్రయత్నంలో సక్సెస్ కాలేదు. అప్పటివరకు చదువులో బ్రేక్ రాని నాకు అదో సవాల్‌లా అనిపించింది. దీంతో 2020, 2021 సంవత్సరాల్లో గట్టిగా ప్రయత్నించినా విజయం సాధించలేకపోయా. దీంతో ప్రిపరేషన్‌లో లోపాలు సవరించుకుంటూ 2022 మే నెలలో రాసిన సివిల్స్‌లో ప్రిలిమ్స్ వచ్చింది. సెప్టెంబర్‌లో మెయిన్స్ క్రాక్ చేశాను. 2023 మేలో ఢిల్లీలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈసారి తప్పకుండా విజయం సాధిస్తాననే నమ్మకం నిజమైంది.

'శాట్స్'ను మరింత బలోపేతం చేస్తాం..



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, పక్కన డీవైఎస్ఓ పరంధామరెడ్డి తదితరులు

- కేసీఆర్ ఆలోచనతోనే సీఎం కప్
- మండల, జిల్లాస్థాయిలో 4.50లక్షల క్రీడాకారుల హాజరు
- శాట్స్ చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్స్)ను మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలకు మంగళవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ శాట్స్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సూచనలతో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుండగా అంచనాలకు మించి క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 4.50లక్షల మంది క్రీడాకారులు హాజరుకావడం రికార్డు అని తెలిపారు. ఇక రాష్ట్రస్థాయిలో ఈనెల 28నుంచి సీఎం కప్ పోటీలను హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం, గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు ఇప్పటి వరకు ఉన్న నగదు ప్రోత్సాహాన్ని రూ.2.50 కోట్లకు పెంచామని తెలిపారు. కాగా రాష్ట్రంలోని 75 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్టేడియంలు ఏర్పాటు చేశామని ఆంజనేయ గౌడ్ చెప్పారు. ఇక పాటియాల శిక్షణ కేంద్రానికి దీటుగా హైదరాబాద్‌లో ఎన్ఐఎస్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్) శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

త్వరలో కాంట్రాక్టు కోచ్‌ల క్రమబద్ధీకరణ

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కోచ్‌ల సర్వీస్‌ను త్వరలోనే క్రమబద్ధీకరిస్తామని శాట్స్ చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో చాలామంది కాంట్రాక్టు కోచ్‌లు ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్నా గత ప్రభుత్వాల అలసత్వంతో క్రమబద్ధీకరణ ఆలస్యం జరిగిందని చెప్పారు. అయితే, తాము త్వరలోనే వీరి సర్వీస్ రెగ్యులర్ చేయనున్నామని, ఇప్పటికే ఫైల్ సిద్ధం కాగా ఆర్థిక శాఖ అనుమతి రాగానే ఉత్తర్వులు వెలువరిస్తామని తెలిపారు. అలాగే, క్రీడా సంఘాలకు బడ్జెట్ త్వరలో విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

విధుల్లో చేరిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు



జాయినింట్ లెటర్లు స్వీకరిస్తున్న అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాలకు కేటాయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం విధుల్లో చేరారు. ఇటీవల మెడికల్ కాలేజీకి 25మందిని కేటాయించగా సోమవారం హైదరాబాద్‌లో వారు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఉత్తర్వులు స్వీకరించారు. ఇందులో పది మంది ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ సమక్షాన విధుల్లో చేరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నెల సమయం కేటాయించినందున మిగతా వారు కూడా త్వరలో విధుల్లో చేరే అవకాశముంది. కాగా, 25 మందిని కేటాయించడంతో ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఇక నుంచి వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి.

క్లుప్తంగా

మోడల్ కెరీర్ సెంటర్‌లో రేపు జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 25వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. హైదరాబాద్‌లోని కీసరరోడ్డులో ఉన్న ఈసీఐఎల్‌లో 287 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఐటీఐ పూర్తిచేసిన వారే అర్హులని, ఆసక్తి కలిగిన వారు గురువారం ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

కారేపల్లి వాసికి డాక్టరేట్


పానుగోటి మధు

కారేపల్లి: కారేపల్లికి చెందిన పానుగోటి మధుకు డాక్టరేట్ లభించింది. ఆయన 'స్ఫటికాకార ఘన పదార్థాలు, దాని సాధనాల పెరుగుదల' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఉత్తరాఖండ్‌లోని హిమాలయ గర్వాల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించింది. కారేపల్లికి చెందిన టైలర్ పానుగోటి హరినాథ్–ఆంధ్రవాణి కుమారుడైన మధు ప్రస్తుతం వారణాసిలోని ఇంటర్నేషనల్ హిందూ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం


అన్నారుగూడెంలో తడిసిన ధాన్యం బస్తాలు

తల్లాడ: మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసినఅకాల వర్షానికి వరి ధాన్యం తడిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యమే కాక బస్తాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోయింది. మండలంలోని అన్నారుగూడెం, తల్లాడ, కుర్నవల్లి, బిల్లుపాడు, రేజర్ల, కలకొడిమల్లో ఈ పరిస్థితి నెలకొనగా, తమను ఆదుకోవాలని చేసి రైతులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు

కామేపల్లి(కారేపల్లి): అపరిచిత వ్యక్తుల వద్ద రైతులు వద్ద నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. రైతులకు అవగాహన కల్పించేలా వ్యవసాయశాఖ ద్వారా ఆధ్వర్యాన చేపట్టిన ప్రచారాన్ని మంగళవారం ఆమె కామేపల్లి మండలం ముచ్చర్లలో రైతువేదిక వద్ద ప్రారంభించి మాట్లాడారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. అంతేతప్ప గ్రామాలకు వచ్చే దళారుల మాటలు నమ్మి విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టం ఎదురవుతుందని చెప్పారు. అలాగే, బీటీ–3 హెర్బిసైట్ టోలరెంట్ పత్తి విత్తనాలను కొనుగోలు చేయొద్దని అవగాహన కల్పించారు. అనంతరం ముచ్చర్ల, పండితాపురంల్లోని నర్సరీల్లో టేకు మొక్కలను పరిశీలించారు. సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ, ఏడీఏ బి.సరిత, ఏఓ బి.తారాదేవి, ఏఈఓలు జి.ఉష, షేక్ మున్నీతో పాటు భూక్యా రవికుమార్, గుగులోత్ నెహ్రూ, రెడ్డబోయిన రమేష్, జక్కుల మల్లయ్య, గాదె ముత్తయ్య, మోత్కూరి సీతయ్య, రామకృష్ణ, సైదులు, లక్ష్మణ్‌రావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో రైతు మృతి

కామేపల్లి(కారేపల్లి): ప్రమాదవశాత్తు చెరువు కట్టవద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టడంతో రైతు మృతి చెందాడు. కామేపల్లి మండలం బాసిత్‌నగర్ పంచాయతీ పరిధి పూసలతండా గ్రామానికి చెందిన రైతు బాదావత్ శ్రీనివాస్(35) తన ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమి దున్నేందుకు మంగళవారం ఉదయం బయలుదేరాడు. ఈక్రమంలో చెరువు కట్ట వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

భూతగాదాలో దంపతులపై దాడి

కొణిజర్ల: భూతగాదాల నేపథ్యంలో కొందరు వ్యక్తులు భార్యాభర్తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల కుమారుడు మిరిదొడ్డి పిచ్చయ్య, ఎస్ఐ జె.శంకరరావు కథనం ప్రకారం... మండలంలోని సాలెబంజరకు చెందిన మిరిదొడ్డి వెంకటేశ్వర్లు – జానకమ్మ, వీరి కుమారుడు పిచ్చయ్య సోమవారం పొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన మామిళ్ల అరుణ్, మామిళ్ల సంధ్య, వెంకటలక్ష్మి, తుప్పతి రాజలింగం, లాలమ్మ వచ్చి తమ పనులెలా చేస్తారంటూ కర్రలతో దాడి చేశారు. ఈఘటనలో వెంకటేశ్వర్లు, జానకమ్మకు తలలు పగిలి తీవ్ర గాయలయ్యాయి. దీంతో వారిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించిన కుమారుడు మంగళవారం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

ప్రభుత్వ పాఠశాలలకు హంగులు !

పీఎంశ్రీ పథకంతో మహర్దశ
- జిల్లాలో 22 పాఠశాలలు ఎంపిక
- ఐదేళ్ల పాటు రూ.40లక్షల చొప్పున అందనున్న నిధులు


సత్తుపల్లిలోని ఓల్డ్ యూపీఎస్ స్కూల్


ప్రభుత్వ పాఠశాలలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోఅరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న నేపథ్యాన ఆధునిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం సంకల్పించింది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పేరుతో ఎంపిక చేసిన పాఠశాలలను రానున్న విద్యాసంవత్సరం నుంచి సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మంజూరు చేసే నిధులతో బడులు కొత్తరూపు దాల్చనున్నాయి. ఈమేరకు జిల్లాలో 22 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే మన ఊరు–మన బడి పథకం ద్వారా రాష్ట్రప్రభుత్వం పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుండగా.. ఇప్పుడు పీఎంశ్రీ నిధులు కూడా వస్తే సర్కార్ పాఠశాలల్లోని విద్యార్థులకు మరింత మేలు జరగనుంది.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

పీఎంశ్రీ పథకం కింద సత్తుపల్లి మండలంలో జెడ్పీహెచ్ఎస్(తుంబూరు), ఓల్డ్‌యూపీఎస్(సత్తుపల్లి) ఎంపికయ్యాయి. ఇక వేంసూరు మండలంలో జెడ్పీహెచ్ఎస్(కందుకూరు), పెనుబల్లి మండలంలో జెడ్పీహెచ్ఎస్(వీ.ఎం.బంజర్), కల్లూరు మండలంలో ప్రభుత్వ పాఠశాల(కల్లూరు), ఏన్కూరు మండలంలో టీఎస్ఆర్‌ఈఐఎస్(ఏన్కూరు), బోనకల్ మండలంలో జెడ్పీహెచ్ఎస్(ముష్టికుంట), కొణిజర్ల మండలంలో జెడ్పీహెచ్ఎస్(సింగరాయపాలెం), మధిర మండలంలో జెడ్పీహెచ్ఎస్(మడుపల్లి), ముదిగొండ మండలంలో జెడ్పీహెచ్ఎస్(ముదిగొండ), తల్లాడ మండలంలో జెడ్పీహెచ్ఎస్(కుర్నవల్లి), వైరా మండలంలో టీఎస్ఆర్‌ఈఐఎస్(వైరా), జెడ్పీహెచ్ఎస్(రెబ్బవరం), ఎర్రుపాలెం మండలంలో ప్రభుత్వ ఎస్ఆర్ఆర్ఎం(బనిగండ్లపాడు) హైస్కూళ్లు ఎంపికయ్యాయి. అంతేకాక చింతకాని మండలంలో జెడ్పీహెచ్ఎస్(పందిళ్లపల్లి), సింగరేణి మండలంలో టీఎస్ఎంఎస్(కారేపల్లి), ఖమ్మం రూరల్ మండలంలో టీడబ్ల్యూఏజీహెచ్ఎస్(ఖమ్మం–ఏ), ఖమ్మం అర్బన్ మండలంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఈఎస్ బాలికల జూనియర్ కళాశాల, కూసుమంచి మండలంలో జెడ్పీహెచ్ఎస్(కూసుమంచి), నేలకొండపల్లి మండలంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(సింగారెడ్డిపాలెం), రఘునాథపాలెం మండలంలో జెడ్పీహెచ్ఎస్(రఘునాథపాలెం), తిరుమలాయపాలెం మండలంలో జెడ్పీహెచ్ఎస్(జల్లేపల్లి) పాఠశాలలు జిల్లా నుంచి ఎంపికైన జాబితాలో ఉన్నాయి.

పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు

కేంద్రప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 40శాతం నిష్పత్తిలో పీఎంశ్రీ ద్వారా నిధులు కేటాయిస్తుంది. ఇప్పటికే మంచి ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. పీఎంశ్రీ ద్వారా వచ్చే నిధులతో పాఠశాలల్లో ఎల్‌ఈడీ లైట్లు, పోషకాహార వనం, సోలార్ ప్యానళ్లు, వ్యర్థాల నిర్వహణ, సొంత భవనాలు, మరుగుదొడ్లు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు, డిజిటల్ గ్రంథాలయం, ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, క్రీడా మైదానం, శుద్ధిజలం, డిజిటల్ బోధన, సైన్స్ ల్యాబ్ వంటి సదుపాయాలను కల్పిస్తారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెబుతున్నారు. కాగా, ఈ పథకం ద్వారా ఒక్కో పాఠశాలకు ఏటా రూ.40లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ.2కోట్ల నిధులు అందించనున్నారు. అయితే, ఈ నిధులను ప్రాధాన్యతాక్రమంలో, ఆయా పాఠశాలల అవసరాలకు అనుగుణంగా మంజూరు చేసే అవకాశముంది.

కార్పొరేట్‌కు దీటుగా..



పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి నాణ్యమైన అందుబాటులోకి వస్తుంది. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండడంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది.

– బి.రాములు, ఎంఈఓ, సత్తుపల్లి

చాలా సంతోషంగా ఉంది..



జిల్లాలోనే ఏకైక యూపీఎస్ పాఠశాలగా సత్తుపల్లి ఓల్డ్ యూపీఎస్ పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావటం సంతోషంగా ఉంది. ఈ పథకం అమలుతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు వీలువుతుంది. విద్యార్థులకు కావాల్సిన ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

– చిత్తలూరి ప్రసాద్, హెచ్ఎం, పాతసెంటర్ యూపీఎస్, సత్తుపల్లి

అదుపు తప్పి మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, ఇంకొకరికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన ఐస్‌క్రీం వ్యాన్ (ఇన్‌సెట్) వినయ్(ఫైల్)

కొణిజర్ల: లారీ, ఐస్‌క్రీమ్ మినీ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తనికెళ్ల సమీపాన మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలు ఎస్ఐ జె.శంకరరావు కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం కైకొండాయగూడెంకు చెందిన చింతలపాటి వినయ్(31) ఖమ్మం ముస్తఫానగర్‌లోని వినాయక ఏజెన్సీస్ ఐస్‌క్రీమ్ పార్లర్‌లో పనిచేస్తున్నాడు. వైరాలో ఐస్‌క్రీమ్ డెలివరీ ఇచ్చేందుకు మంగళవారం అదే గ్రామానికి చెందిన మిత్రుడు బన్నీతో కలిసి మినీ వ్యాన్‌లో వెళ్తుండగా వైరా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ టైర్ పేలిపోవడంతో అదుపు తప్పి వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో వ్యాన్ క్యాబిన్ నుజ్జునుజ్జయి డ్రైవింగ్ చేస్తున్న వినయ్ క్యాబిన్‌లో ఇరుక్కపోయి మృతి చెందాడు. ఇదే వాహనంలో ఉన్న బన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై గాయాల పాలైన బన్నీని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన వినయ్ మృతదేహాన్ని పోలీసులు వెలికితీయగా, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఖమ్మం ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రోడ్డు ఖానాపురం సెంటర్‌లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. రామాలయం ఆర్చీ ఎదుట రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వి.నాగరాజు గాయపడగా, కరెంట్ ఆఫీస్ వద్ద ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ఇస్మాయిల్‌తోపాటు మరో ముగ్గురు గాయపడగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ మధుకు న్యూయార్క్‌లో సత్కారం


ఎమ్మెల్సీ మధును సత్కరిస్తున్న ప్రవాస భారతీయులు

ఖమ్మం వైరారోడ్: ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి అమెరికాలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను న్యూయార్క్‌లో ఘనంగా సన్మానించారు. తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ ఆధ్వర్యాన ఎన్ఆర్ఐలు ఆయనను సత్కరించారు. ఆటా మాజీ అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త పైళ్ల మల్లారెడ్డి, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ అయోధ్యరామిరెడ్డితో పాటు కొండబోలు రవికుమార్, డాక్టర్ తిరుమలరావు, మన్నం రమణ, లక్ష్మారెడ్డి, ముత్యాల వెంకటేష్, ఓలేటి రావు, కృష్ణశ్రీ, తునుగుంట్ల శిరీష తదితరులు పాల్గొన్నారు.


ఖోఖో ఆడుతున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్

హోరాహోరీగా పోటీలు

- రెండు రోజుకు చేరిన సీఎం కప్
- బహుమతులు అందజేసి శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, డీవైఎస్ఓ పరంధామరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈమేరకు సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీల్లో విజేతలను వివరాలను అధికారులు ప్రకటించారు. అనంతరం విజేతలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్స్) చైర్మన్ ఈడిగ ఆంజనేయగౌడ్ బహుమతులు అందజేసి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడల్లో రాణించాలని, తద్వారా వ్యక్తిగతంగా విజయాలు సాధించడమే కా జిల్లా, రాష్ట్ర ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు. అనంతరం ఆయన క్రీడాకారులతో కాసేపు సరదాగా ఖో–ఖో ఆడారు.

విజేతల వివరాలు...

సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా రెండో రోజు విజేతల వివరాలిలా ఉన్నాయి. ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండల జట్లు, మహిళల విభాగంలో రఘునాథపాలెం, చింతకాని జట్లు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఆర్చరీ విభాగంలో ఇండియాన్ రౌండ్‌లో బి.అనిల్, కె.నరేంద్ర దొర, కాంపౌండ్ రౌండ్‌లో ఎస్.కే.సాహెల్, కె.సౌజన్య, సీహెచ్.ఆదిత్య విజేతలుగా నిలవగా వాలీబాల్ పురుషుల విభాగం ఖమ్మం అర్బన్, ఏన్కూర్, మహిళల విభాగంలో ఖమ్మం అర్బన్, బోనకల్, కబడ్డీ పురుషుల్లో నేలకొండపల్లి, ఏన్కూర్, బాస్కెట్‌బాల్‌లో పీవీఆర్ స్పోర్ట్స్ క్లబ్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ఖో–ఖో పురుషుల విభాగంలో ఖమ్మం అర్బన్, మధిర, మహిళల విభాగంలో ఖమ్మం అర్బన్, బోనకల్ జట్లు విజేతలుగా నిలిచాయి. ఇక అథ్లెటిక్స్ పురుషుల 100 మీటర్లలో ఎస్.కే.లాల్‌పాషా, కె.పవన్ తేజ, 40 మీటర్లలో కె.రవితేజ, కె.మస్తాన్, లాంగ్‌జంప్ పురుషుల్లో ఎల్.విక్రం, ఎ.సురేష్, షాట్‌పుట్‌లో ఎస్.కే.మజీద్‌పాషా, ఎస్.కే.ఆఫ్రాట్, మహిళల విభాగం 100 మీటర్లలో డి.బిందు, ఎం.మనీషా, 400 మీటర్లలో ఎ.మైథిలి, పి.కామాక్షి, లాంగ్‌జంప్‌లో ఎస్.కే, ఆఫ్రీన్, కె.మనస్విత, షాట్‌పుట్‌లో హాజీరా ఫాతిమా, పి.వెంకటరమణ ప్రథమ, ద్వితీయస్థానాలు చేజిక్కించుకున్నారు. అలాగే, రెజ్లింగ్‌లో ఎం.రాజారాం, ఎస్.వినయ్, స్విమ్మింగ్‌లో కె.సౌజన్య, డి.రాందేశ్, ఎం.ప్రసాద్, కె.హేమ విజేతలుగా నిలిచారు. ఈకార్యక్రమంలో డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి బీఆర్ఎస్ నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ. అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మోహన్‌రావు,నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఆధ్వర్యాన ఈనెల 27న ఖమ్మంలో జరగనున్న నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన నిరుద్యోగ మార్చ్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఖమ్మం జెడ్పీ సెంటర్ నుంచి మయూరి సెంటర్ వరకు జరిగే మార్చ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, పలు పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేశారని ఆరోపించారు. తద్వారా నష్టపోయిన నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు మార్చ్ నిర్వహిస్తున్నట్లు మోహన్‌రావు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కోనేరు చిన్ని, నాయకులు శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, మంద సరస్వతి, వాసుదేవరావు, నరేందర్, కుమిలి శ్రీనివాస్, నెల్లూరి కోటేశ్వరావు, ఎం.డీ.యాకూబ్ పాషా, గెంటెల విద్యాసాగర్, అల్లిక అంజయ్య, దీకొండ శ్యాం, పసుమర్తి సతీష్ పాల్గొన్నారు.

రూ.2వేల నోట్లతో బ్యాంకులకు...


ఖమ్మంలోని ఓ బ్యాంకులో క్యూలో ఉన్న ఖాతాదారులు

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్‌బీఐ మంగళవారం నుంచి బ్యాంకుల్లో జమ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈమేరకు ఒక దఫాలో పది నోట్లను జమ చేసుకునేందుకు వెసలుబాటు కల్పించగా.. ఇప్పటికే పలువురు తమ ఖాతాలు, ఏటీఎంల్లో జమ చేసుకున్నారు. ఇక మంగళవారం నుంచి బ్యాంకులకు వస్తున్నారు. కాగా, తొలిరోజు మంగళవారం బ్యాంకుల్లో అంతగా రద్దీ కనిపించలేదు. 2016 నవంబర్‌లో కేంద్రప్రభుత్వం రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసిన సమయాన బ్యాంకుల వద్ద బారులు దీరి కనిపించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో పేద, మధ్య తరగతి వర్గాల వారి వద్ద రూ.2వేల నోట్లు అంతగా లేవని వెల్లడవుతోంది.

ఉద్యమ ఆకాంక్షలను నీరుగార్చారు..

టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్


ప్లీనరీలో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్

ఖమ్మంమామిళ్లగూడెం: ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ప్రభుత్వం నీరుగార్చిందని తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ విమర్శించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన పార్టీ జిల్లా ప్లీనరీలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేని ప్రభుత్వం.. దశాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావడం గర్హనీయమన్నారు. తెలంగాణ కాంట్రాక్టులన్నీ సీమాంధ్రులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. వందలాది మంది యువకులు బలిదానాలు చేసుకున్నది పండగలకు ఇచ్చే చీరె, సారెల కోసం కాదని తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధితోపాటు నీళ్లు, నిధులు, నియామకాలు కావాలని ఆశిస్తే అలాంటివేమీ జరగలేదని చెప్పారు. మరో ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు మాట్లాడుతూ పాలకులునిధులను దుబారా చేస్తూ తెలంగాణను అప్పులపాలు చేశారని ఆరోపించారు. రైతుబంధును చూపి మొత్తం వ్యవసాయాన్ని కుప్పకూల్చారని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రతిపాదించి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ఆమోదం కోసం తీర్మానించారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాబు అధ్యక్షతన జరిగిన ప్లీనరీలో నాయకులు నూనావత్ రవీందర్, జంగిపల్లి రవి, సర్దార్, పోలూరు శ్రీనివాస్, ప్రసాద్, భూక్యా వీరన్న, శ్రీనివాసచారి, రామాచారి, బాలరాజు, మోహన్‌రావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పీఆర్ ఉద్యోగుల పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు పూనుకోవడంపై ఆయన చిత్రపటానికి ఖమ్మం పీఆర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవా రం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుదర్శన్‌రావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్వ్యవస్థీరణకు ఆమోదం తెలపడంతో డివిజన్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. తద్వారా ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎంతో పాటు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తన్నీరు హరీశ్‌రావు, కేటీఆర్, సీఎస్ శాంతికుమారి, పీఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజనీర్ చీఫ్ సంజీవరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్స్, డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ల నాయకులు కేవీకే.శ్రీనివాస్, వెంకటరెడ్డి, రామకృష్ణ, రఘుకుమార్, ఆదిత్యరాజు, వీరయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బందెలదొడ్డి భూమి కబ్జాకు యత్నం?

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడులో బందెలదొడ్డికి చెందిన సుమారు రెండు కుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రహరీ కూల్చివేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. సత్తుపల్లికి చెందిన గుడిమెట్ల భాస్కర్‌రావు కుటుంబ సభ్యులు తల్లి అమ్మన జ్ఞాపకార్థం ఇరవై ఏళ్ల క్రితం భూమిని కొని అప్పటి పంచాయతీకి అప్పగించారు. దీంతో ప్రహరీ నిర్మించి నీళ్ల తొట్లు ఏర్పాటుచేసి బందెల దొడ్డి నిర్వహిస్తున్నారు. అయితే, రోడ్డును ఆనుకుని ఉన్న ఈ భూమి విలువ రూ.30లక్షలకు పైగా ఉండడంతో అక్రమార్కులు ప్రహరీని కూల్చివేసి ఆనవాళ్లు లేకుండా చేశారు. దీంతో స్థానికులు నాగళ్ల రామారావు, కొత్రపాటి సాల్మన్‌రాజు, మోరంపూడి సత్యం, మల్లెం వెంకటేశ్వరరావు తదితరులు మంగళవారం పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అయ్యగారిపేట రెవెన్యూలోని సత్తుపల్లి–కాకర్లపల్లి రోడ్డు శివారు మూలమలుపు వద్ద భూమిని అమ్ముకున్న కొందరు క్రమబద్ధీకరించుకున్నట్టు తెలిసింది. ఇదే తరహాలో బందెల దొడ్డి భూమి కబ్జాకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సుజాత మాట్లాడుతూ బందెల దొడ్డి భూమి విషయం తెలిసిందని, బుధవారం పరిశీలిస్తామని తెలిపారు.

పిడుగుపాటుకు కోడెదూడ మృతి

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో సోమవారం అర్ధరాత్రి అకాల వర్షం కురవడంతో పాటు పిడుగులు పడ్డాయి. గ్రామానికి చెందిన రైతులు మర్రి వెంకటేశ్వర్లు తమ పశువులను ఆరుబయట కట్టేయగా, పిడుగు పడడంతో రూ.30వేలు విలువైన కోడెదూడ మృతి చెందింది.

ఆందోళనకరంగానే!

ఎంపీ అవినాశ్ మాతృమూర్తికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

- క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యం అందిస్తున్న విశ్వభారతి వైద్య బృందం
- తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాశ్
- సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వచ్చారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు
- దుష్ప్రచారాలను ఖండిస్తూ శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నిరసన



కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఎంపీ అవినాశ్ నిరంతరం అక్కడే ఉంటూ తల్లి బాగోగులు ఎప్పటికప్పుడు స్వయంగా చూసుకుంటున్నారు. వారిని పరామర్శించేందుకు రాయలసీమ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎంపీ అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేస్తోందంటూ తప్పుడు వార్తలకు తెర తీసిన ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యులు బులిటెన్ విడుదల చేయడం, ఓ వర్గం మీడియా తప్పుడు వార్తల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపైనే సోమవారం రాత్రంతా గడిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బలగాలను తరలించారు.

సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వెళ్లారంటూ..

పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటున్న సీబీఐ అధికారులు అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి మాత్రమే వెళ్లారు. అయితే ఎల్లో మీడియా మాత్రం సీబీఐ అధికారులు విశ్వభారతి ఆస్పత్రిలోకి వెళ్లారని, అక్కడ పరిస్థితి, శ్రీలక్ష్మి ఆరోగ్యం గురించి వాకబు చేశారని దుష్ప్రచారం చేస్తూ డిబేట్లు నిర్వహించింది. విశ్వభారతి ప్రాంగణం, గాయత్రి ఎస్టేట్‌లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెదరగొట్టి ఉద్రిక్తతకు దారితీసేలా కథనాలు ప్రసారం చేసింది. రోప్ పార్టీ పోలీసులు భోజనం చేసేందుకు వెళుతుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై ఆందోళనకు దిగినట్లు ఎల్లో మీడియా తప్పుడు వార్తలకు తెగబడింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం మంగళవారం సాయంత్రం వరకూ అంతా ప్రశాంతంగా ఉండటంతో ఇక రాత్రికి అవినాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మళ్లీ ప్రచారానికి తెరతీసింది.

శాంతియుతంగా నిరసన..

శ్రీలక్ష్మి, అవినాశ్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్, మేయర్లు సురేశ్‌బాబు, బీవై రామయ్య కడప, కర్నూలు కార్పొరేషన్ల కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నిరసిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మంగళవారం రాత్రి 7 గంటలకు ఆస్పత్రి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడగానే 27 తర్వాత తానే స్వయంగా వస్తానని ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రకటించారని, మానవత్వంతో వ్యవహరించాలని సీబీఐ అధికారులకు సూచించారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిల్ కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరపు న్యాయవాదితో జస్టిస్ నరసింహ

సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిలుపై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని ఆదేశించింది. గతంలో మరో బెంచ్ విచారించినప్పటికీ వెకేషన్ బెంచ్ విచారణకు అడ్డంకి కాదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.



హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు (జూన్ 5) వచ్చే వరకు సీబీఐ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని లేదా తన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా ఆదేశాలివ్వాలంటూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత హైకోర్టు విచారించలేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. హైకోర్టు రెండుసార్లు విచారించిందని, ఉత్తర్వులు ఇవ్వలేదని, జూన్ 5కు వాయిదా వేసిందని, మే 15న సీబీఐ నుంచి నోటీసులు వచ్చాయని అవినాశ్ తరపున సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. 'హైకోర్టులో విచారణ ఉండగా సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం' అని అభిప్రాయపడిన ధర్మాసనం.. సీబీఐ విచారణకు హాజరు కాలేదు కదా అని అనగా.. ఏడుసార్లు పిటిషనర్ హాజరయ్యారని గిరి తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలో రావాలని నోటీసులు ఇవ్వడంతో మూడు రోజులు సమయం కోరామన్నారు. సీబీఐ తరపున ఎవరైనా హాజరయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎవరూ హాజరు కాలేదని వైఎస్ వివేకా కుమార్తె సునీత తరపు న్యాయవాది లూత్రా తెలిపారు. హైకోర్టులో ఏప్రిల్ 27న ఇద్దరి పిటిషన్లూ విచారణకు వచ్చాయని, సీజే వద్దకు వెళ్లినా ఎలాంటి ఆర్డర్ రాలేదని, జూన్ 5న మేటర్ జాబితా అయిందని లూత్రా వివరించారు. జస్టిస్ నరసింహ జోక్యం చేసుకొని.. ఏమైనా అరెస్టు భయం ఉందా అని ప్రశ్నించారు. తాను మొదటి నుంచి అదే చెబుతున్నానని, ఇప్పటికే అవినాశ్ తండ్రి అరెస్టయ్యారని, తల్లి ఆసుపత్రిలో ఉన్నారని గిరి చెప్పారు. ఈ సమయంలో లూత్రా జోక్యం చేసుకోవడంతో గిరి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గిరిని ధర్మాసనం మందలించడంతో ఆయన ధర్మాసనానికి క్షమాపణలు తెలిపారు. బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉందని ధర్మాసనం లూత్రానుద్దేశించి వ్యాఖ్యానించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ గురించి ఆరా తీసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు వెకేషన్ బెంచ్ వినాలని సూచిస్తామని తెలిపింది. హైకోర్టుకు వెళ్లాలని ఇరువర్గాలకు తెలిపింది. అవినాశ్ వద్దకు వెళ్లాలని సీబీఐ ప్రయత్నించగా వందలాది మంది అనుచరులు అడ్డుకున్నారని లూత్రా అనగా.. అవన్నీ సీబీఐ న్యాయవాది చెబుతారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం జస్టిస్ నరసింహ ఉత్తర్వులు వెలువరించారు.



తాగునీటి కోసం రాస్తారోకో

వెంకటాపురం(కె): తాగునీటి కోసం ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఉప్పేడు, గొల్లగూడెం గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. తమకు 15 రోజులుగా తాగునీరు అందడం లేదని.. సర్పంచ్, కార్యదర్శులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వెంకటాపురం(కె), భద్రాచలం రహదారిపై ఖాళీ బిందెలతో కూర్చున్నారు. సుమారు 2గంటల పాటు రహదారిపై ఆందోళన చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ టాప్

- ఇప్పటికి 5.56 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- 5.25లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నిజామాబాద్
- కొనుగోళ్లలో వెనుకబడిన 18 జిల్లాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో కొనుగోళ్లు నత్తనడకన నడుస్తుండగా, మరికొన్ని జిల్లాల్లో వేగంగా జరుగుతున్నాయి. అత్యధికంగా కొనుగోలు చేసిన జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. కొనుగోళ్లలో అనేక సమస్యలు ఎదురవుతున్నా జిల్లా యంత్రాంగం వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోంది. సాధారణంగా ఏటా నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా ధాన్యం కొను గోలు చేస్తారు. ఈసారి మాత్రం నల్లగొండలో ఇప్పటికే అత్యధికంగా కొనుగోలు చేశారు. ఈ రెండు జిల్లాలతో పాటు మరో 10 జిల్లాల్లో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నా మిగతా జిల్లాల్లో మాత్రం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. రాష్ట్రంలో 62,15,957 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఇప్పటికి 56,72,270 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

తాలు తంటా.. మిల్లర్ల కొర్రీలు

రాష్ట్రంలోని 18 జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనకబడ్డాయి. అందులో 9 జిల్లాల్లో కొనుగోలు లక్ష్యంలో సగం ధాన్యం కొనుగోలు చేయకపోగా, మరో 9 జిల్లాల్లో పావలావంతు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, మేడ్చల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనుకబడ్డాయి. మరికొన్ని జిల్లాలు లక్ష్యంలో సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. అందులో యాదాద్రి, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, నిర్మల్, వరంగల్, కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.

అనేక చోట్ల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవడం, కొన్నిచోట్ల తడిచిన ధాన్యం మొలకెత్తడం, మరికొన్ని తాలు ఉందంటూ మిల్లర్లు నిరాకరించడం వంటి సమస్యలతో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. ముఖ్యంగా మిల్లర్ల కొర్రీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈసారి వర్షాకాలం సీజన్ సాగను ముందే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కొనుగోళ్లలో వేగం పుంజుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన దిగుబడి.. తగ్గని రాశులు

గతంలో ఎప్పుడూ లేనట్లుగా పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి వచ్చింది. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లు వేగంగా సాగుతున్న జిల్లాల్లోనూ ఇంకా కల్లాల్లో ధాన్యం ఒడవడం లేదు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే చూస్తే గత సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఈసారి ఇప్పటికే 5.56 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినా ఇంకా కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.

ప్రత్యేక చొరవతోనే..

నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతోంది. అధికారులు మొదట్లో 272 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సీజన్‌లో ధాన్యం అధికంగా దిగుబడి రావడం, దానికితోడు అకాల వర్షాలు రావడంతో త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని మరో 100 కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి 45 రోజులుగా ప్రతి రోజు నాలుగైదు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటిస్తున్నారు.

రోజుకు లక్షన్నర టన్నుల ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 38.50 ఎల్‌ఎంటీ ధాన్యం సేకరణ
- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి గంగుల కమలాకర్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్న తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేషన్ జీఎం రాజారెడ్డి తదితరులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సగటున రోజుకు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు యాసంగి ధాన్యాన్ని 38.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరించామని, ఇది గత సీజన్ కన్నా 10 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం లేకున్నా, రైతుల నుంచి కనీస మద్దతు ధరతో సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాల కారణంగా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, గతంలో ఎన్నడూ లేనంతగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతున్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో కోట్లాది రూపాయల ధాన్యం నేలపాలైందని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మంగళవారం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 7,907 కోట్ల విలువ గల ధాన్యాన్ని 6 లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే 400కి పైగా కొనుగోలు కేంద్రాల్లో సేకరణ పూర్తి కాగా, వాటిని మూసేసినట్లు చెప్పారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటిస్తూ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, అక్కడక్కడా ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం స్పందిస్తుందని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

జిల్లా వార్తలు

ప్రజలకు భరోసా కల్పిస్తున్న ఎంపీ నామ



లబ్ధిదారులతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ఎంపీ నామ నాగేశ్వరరావు భరోసా కల్పిస్తున్నారని రైతుబంధు ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.15 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి ఎంపీ సిఫారసుతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, మలీదు వెంకన్న, బత్తుల శ్రీనివాసరావు, తన్నీరు రవికుమార్, జానీబాబా పాల్గొన్నారు.

ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన అధికారిగా సందీప్



సందీప్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారి (ఆన్ డ్యూటీ)గా విధులు నిర్వర్తిస్తున్న గుడిమళ్ల సందీప్‌కుమార్ నిర్మల్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన మంగళవారం ఉట్నూర్‌లో బాధ్యతలు స్వీకరించి అక్కడి కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, భద్రాచలం డివిజన్ ఉద్యాన అధికారిగా సందీప్‌కుమార్‌కు పోస్టింగ్ ఉండగా, ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఖాళీ అయిన ఖమ్మం డివిజన్ ఉద్యాన అధికారి బాధ్యతలను సత్తుపల్లి ఉద్యానాధికారి మీనాక్షికి అప్పగిస్తూ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి జి.అనసూయ ఉత్తర్వులు జారీ చేశారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో మంగళవారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ పలువురికి సభ్యత్వాలు అందజేశారు. నాయకులు జీఎస్.ప్రసాదరావు, ఎం.డీ.మజీద్, లక్ష్మణ్, మురళి, ఉపేందర్, వెంకట్రావు, బాషామియా, ఉమామహేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, సాదిక్ పాల్గొన్నారు.

ఇంకా మీనమేషాలే..



- సబ్ కాంట్రాక్టర్ అక్రమాలపై పట్టింపులేని 'సింగరేణి'
- అసలు కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు కరువు
- ఫలితంగా బాధితులకు బెదిరింపులు

సత్తుపల్లి: సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో దండుకుని తప్పించుకొని తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో సింగరేణి సంస్థ మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ వ్యవహారం సింగరేణికి సంబంధించినది కాదంటూ తప్పించుకునే ధోరణిలో అధికారులు వ్యవహరిస్తుండడం బాధితులకు ఆవేదన కలిగిస్తోంది. సత్తుపల్లి ఓసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని సబ్ కాంట్రాక్టర్ శరత్‌చంద్రపై రూ.లక్షల్లో వసూలు చేసినట్లు బాధితులు అటు సింగరేణి, ఇటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో సింగరేణి ఉద్యోగాల పేరిట టోకరా..., సింగరేణిలో సబ్ కాంట్రాక్టర్లదే హవా, దొరికితేనే దొంగలు.. శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అసలు కాంట్రాక్టర్ చేయాల్సిన పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇవ్వడం, ఆపై వారు దోపిడీకి తెర తీయడంతో పలువురు మోసపోయినా సింగరేణి యాజమాన్యం చర్యలకు దిగకపోవటంతో మరిన్ని అక్రమాలకు ఊతమిచ్చినట్లవుతోంది. సబ్ కాంట్రాక్టర్‌ను పిలిపించి చర్యలు ప్రారంభిస్తే గంటల వ్యవధిలోనే సమస్య కొలిక్కి వస్తుందని తెలిసినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నిందితులు దర్జాగా తిరుగుతున్నారు.

కనీస విచారణ లేదు..

సత్తుపల్లి ఓసీలో పనులను కొత్తగూడెంనకు చెందిన శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుని శరత్‌చంద్రకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చారు. ఈయన పలువురి నుంచి డబ్బులు దండుకున్నట్లు ఫిర్యాదులు అందినా ఆ వ్యవహారం పోలీసులే చూసుకుంటారని సింగరేణి అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఇకనైనా అక్రమాలకు కాంట్రాక్టర్‌ను బాధ్యులుగా చేయకపోతే మరింత మంది సబ్‌కాంట్రాక్టర్ల ముసుగులో అక్రమాలకు పాల్పడతారని చెబుతున్నారు. కాగా, శరత్‌చంద్రతో సింగరేణి అధికారులు కొందరు అత్యంత సన్నిహిత సంబంధాలు నెరిపారని, గతంలో కూడా అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవటంతోనే వసూళ్ల పర్వం విపరీతంగా పెంచాడని ఆరోపిస్తున్నారు.

పోలీసు కేసు అయితే ఏమిటి?

డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు, సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారా.. కేసు అవుతుందా.. అయినా మాకేంటి.. మహా అయితే మూడు నెలలు జైలుకు వెళ్లి మళ్లీ వస్తాం.. అంటూ పలువురు బాధితులకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు సమాచారం. రాజకీయ పలుకుబడి ఉన్న తమను ఏమీ చేయలేరని ధీమాగా ఉన్నట్లు సమాచారం. ఓపక్క అధికారులు చర్యలు తీసుకోకపోగా, మరోపక్క తమనే బెదిరిస్తుండడంతో బాధితులు మరింత వేదనకు గురవుతున్నారు.

కాంట్రాక్టర్‌కు సమాచారం ఇచ్చాం..



డబ్బుల వసూలు విషయమై శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్‌కు మా అధికారులు సమాచారం ఇచ్చారు. ఇప్పటి వరకు సమాధానం రాలేదు. సీఎస్‌పీ కాంట్రాక్ట్ కాల వ్యవధి ఇంకా వారంలో ముగుస్తుంది. సబ్ కాంట్రాక్టు వ్యవహారంతో మాకు సంబంధం లేకపోయినా బిల్లులు నిలిపేస్తాం.

–జక్కం రమేశ్, జీఎం, సింగరేణి కొత్తగూడెం ఏరియా

అటవీ ఉత్పత్తులు జీసీసీకి అమ్మేలా అవగాహన

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించే ఉత్పత్తులను దళారులకు కాకుండా జీసీసీకే అమ్మేలా అధికారులు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం జీసీసీ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ వచ్చేనెల నుంచి ఆదివాసీ గిరిజను లు ఇప్పపువ్వు సేకరించనుండగా జీసీసీ డీఆర్ డిపోల కు అమ్మేలా చూడాలని తెలిపారు. అంతేకాకుండా గిరిజనులకు ఎప్పటికప్పుడు డబ్బు చెల్లించేందుకు నిధుల విషయమై ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జీసీసీ లాభాల బాటలోకి వస్తుందని తెలిపా రు. గిరిజన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని, అక్కడక్కడా వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. బంక్‌లను 24 గంటల పాటు నడిపితే లాభాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో డీఎం జీసీసీ విజయ్‌కుమార్, అధికారులు నర్సింహారావు, లక్ష్మోజీ, దావీద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మానసికంగా కుంగిపోయారా?

14416 కు ఫోన్ చేయండి..

ఖమ్మం వైద్యవిభాగం: మానసికంగా కుంగుబాటుకు గురైన వారి కోసం ప్రభుత్వం 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఖమ్మం డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. వివిధ పరీక్షల్లో రాణించని విద్యార్థులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యాన ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. విద్యార్థులే కాకుండా అన్నివర్గాల ప్రజలకు ఈ నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

తునికాకు.. ఉపాధి మాకు..



కల్లంలో ఆరబెట్టిన తునికాకు కట్టలు

ఉదయం నుంచే అటవీ ప్రాంతానికి గిరిజనులు

కొత్తగూడెంరూరల్: పల్లె ప్రాంతాల్లోని గిరిజనులకు తునికాకు సేకరణ మండుటెండల్లోనూ ఉపాధి కల్పిస్తోంది. ప్రతీ రోజు గిరిజనులు ఉదయాన్నే అటవీ ప్రాంతంలోకి వెళ్లి తునికాకు సేకరణలో నిమగ్నమవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ, ఆళ్లపల్లి, కొత్తగూడెం రేంజ్ పరిధి మైలారం, పునుకుడుచెలక, మద్రిగూడెం, లోతువాగు, బంగారుచెలక, పడిగాయిగూడెం, చింతకుంట, తుమ్మలగూడెం తదితర ప్రాంతాల్లో తునికాకు సేకరణ చురుగ్గా సాగుతోంది. చాతకొండ, ఆళ్లపల్లి, కొత్తగూడెం రేంజ్ పరిధిలో 1,200 స్టాండర్డ్ బ్యాగుల సేకరణ లక్ష్యం కాగా.. ఈ నెల 7వ తేదీ నుంచి కూలీలు తునికాకు సేకరణ, కట్టలు కట్టడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 600 బ్యాగ్‌లు సేకరించినట్లు అధికారిక సమాచారం. కాగా, వేసవిలో వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడే గిరిజనులకు తునికాకు సేకరణతో ఉపాధి లభిస్తోంది. యాభై ఆకుల కట్టకు రూ.3 చెల్లిస్తుండగా, ఒక్కో వ్యక్తి రోజుకు 200 నుంచి 400 కట్టల ఆకు సేకరిస్తున్నట్లు సమాచారం. తద్వారా సుమారు రూ.600 మొదలు రూ.800 వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు.



సేకరించిన తునికాకుతో వస్తున్న మహిళలు



తునికాకు కట్టలు కడుతున్న కుటుంబం

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



శిక్షణకు హాజరైన కేడెట్లతో అధికారులు

ఖమ్మంఅర్బన్: విద్యార్థులను దేశభక్తి కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కృషి అభినందనీయమని లెఫ్టినెంట్ కల్నల్ కమాండింగ్ అధికారి నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. ఖమ్మం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేడెట్లు శిక్షణలో నేర్చుకునే అంశాలతో ఉన్నత స్థాయికి చేరాలన్నారు. పది రోజుల పాటు సాగే ఈ శిబిరానికి ఖమ్మం, వరంగల్, భద్రాదికొత్తగూడెం జిల్లాల కేడెట్లు హాజరుకాగా, ఎన్‌సీసీ ఎస్‌ఎం జితేంద్ర వషిట్, పాఠశాల చైర్మన్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.